

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 20 | అక్టోబర్ | 2025 ♦ పేజీలు : 2

## ప్రజల జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలి

- జిల్లా కలెక్టర్ జితేష్.వి. పాటిల్



**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 19, ప్రజాజ్యోతి:** ప్రజల జీవితాల్లో దీపావళి పండుగ కోటి కాంతులు నింపాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకాంక్షించారు. చీకటి మీద వెలుగు, చెడు మీద మంచి, దుష్ట శక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని అన్నారు ,ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ పండుగను కుటుంబ సభ్యులతో సంతోషభరితంగా, ఆనందోత్సవాలతో జరుపుకోవాలని సూచించారు. టపాసులు కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు బాణాసంచా కాల్చేటప్పుడు తల్లిదండ్రులు తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు. సురక్షితమైన పద్ధతుల్లో పండుగను జరుపుకోవడంతోపాటు ప్రమాదాలను నివారించుకోవాలని, పర్యావరణానికి హాని కలిగించే టపాసులు ఉపయోగించకుండా హరితదీపావళి జరుపుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.





# రహదారి నిర్మాణం ప్రారంభం ఎప్పుడు..?

- రహదారి అంతా గతుకులు, గుంటలమయం
- నెలలు గడుస్తున్నా ప్రారంభం కానీ నిర్మాణ పనులు
- శంకుస్థాపనకే పరిమితమైన వైనం..!
- మండల వాసుల ఇక్కట్లు

**చర్ల, అక్టోబర్ 19:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో ప్రధాన రహదారులు రోజురోజుకీ ఇసుక లారీలతో ధ్వంసం అవుతున్న సంగతి అందరికీ తెలిసినదే ప్రధాన రహదారుల పరిస్థితి అలా ఉంటే చర్ల బస్టాండ్ ఎదురుగా ఉన్న సాయిబాబా గుడి రోడ్డు గుంటలు గతుకుల మయంగా ఉన్నా నిర్మాణ పనులు ప్రారంభం మాత్రం జరగటం లేదు జులై 21వ తారీఖున భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకటరావు చేతుల మీదుగా ఆర్ అండ్ బి రహదారి నిర్మాణ పనులకు గాను శంకుస్థాపన అట్టహాసంగా చేయడం జరిగినది. శంకుస్థాపన చేసి నాలుగు నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాకపోవడంతో మండల వాసులు ఆ మార్గం మీద ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారు . మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ,ఎంఈఓ ఆఫీస్,అంగన్వాడీ కార్యాలయం ,వెలుగు ఆఫీస్ ,విద్యుత్ బిల్లుల చెల్లింపు కార్యాలయం,రైతువేదిక , వ్యవసాయ అధికారి కార్యాలయాలకు ఇదే మార్గం గుండా వెళ్ళవలసి ఉంటుంది. మండలంలోని ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఈ రోడ్డు మార్గం మీదే వెళ్లి ఆయా సంబంధిత కార్యాలయాలకు వెళ్ళవలసిన పరిస్థితి అంత ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నటువంటి ఆ మార్గం మొత్తం గతుకులమయంతో గుంటలతో ఏదో ఒక ప్రమాదానికి మండల వాసులు గురవుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, లక్ష్మి కాలనీ , తాలిపేరు ప్రాజెక్ట్ లకు కూడా ఈ రోడ్డు మార్గం మీద వెళ్లాల్సి ఉంటుంది. మండల వాసులు ప్రభుత్వ అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా రహదారి నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కావడం లేదని రాత్రి వేళల్లో ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే ఇబ్బందులకు గురవుతున్నామని మండల వాసులు వాపోతున్నారు .భద్రాచలం శాసనసభ్యులు చేతుల మీదుగా ప్రారంభమైన రహదారి నిర్మాణం శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంతో మండల వాసులు ఇబ్బందులకు గురిఅవుతున్నారు . భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు చొరవ తీసుకొని చర్ల బస్టాండ్ ఎదురుగా ఉన్న సాయిబాబా గుడి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టి ప్రమాదాలు జరగకుండా అరికట్టవలసిందిగా మండల వాసులు కోరుతున్నారు.

## ప్రజలందరూ దీపావళిని ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట వెల్లడి




**భద్రాచలం, అక్టోబరు 19,ప్రజాజ్యోతి :** భద్రాచలం ఏజెన్సీలో ఉండే ప్రజలందరూ దీపావళిని ఆనందోత్సాహాల నడుమ కుటుంబ సమేతంగా జరుపుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ,సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట వెల్లడించారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులందరూ కుటుంబాలతో ఆనందంగా గడపాలని, మందుగుండు సామాగ్రి కాల్చే సమయంలో జాగ్రత్తలు వహించాలని కోరారు.

## పాల్వంచ ఆర్టీఏ చెక్ పోస్టుపై ఏసీబీ దాడులు..!

- ఏసీబీ దాడులతో బయటపడిన అవినీతి వ్యవస్థ
- రూ. 25 వేల అనధికార నగదు స్వాధీనం
- అధికారులు, సిబ్బంది పాత్రపై అనుమానాలు
- నగదు లావాదేవీలపై సమాధానం ఇవ్వని ఎంవిఐ మనోహర్





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 19 (ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ ఆర్టీఏ చెక్ పోస్టులో అవినీతి మరో సారి బహిర్గతమైంది. వాహనాల చెకింగ్ పేరుతో నెలకొన్న 'క్యాష్ చెకింగ్' వ్యవస్థపై ఏసీబీ అధికారులు శనివారం అర్ధరాత్రి నుంచి విస్తృత దాడులు నిర్వహించారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో పాల్వంచ మండలం నాగారం చెక్ పోస్టు పరిసర ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. ఏసీబీ ఇన్ స్పెక్టర్లు సట్ల రాజు, లావుడియా రాజు, ఇతర సిబ్బంది ఈ ఆపరేషన్ లో పాల్గొన్నారు. చెక్ పోస్టులో పనిచేస్తున్న సిబ్బంది

మిగతా 2 లో...

## ఉత్తర తెలంగాణ ఏకల్ అభియాన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన బోడ పుణ్య



**టేకులపల్లి,అక్టోబర్19,ప్రజాజ్యోతి:** ఉత్తర తెలంగాణ ఏకల్ అభియాన్ ఉపాధ్యక్షుడిగా బోడ పుణ్య నాయక్ ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకల్ అభియాన్ నాన్ ప్రాఫిట్ మేకింగ్ సంస్థలో ఉత్తర తెలంగాణ విభాగానికి ఉపాధ్యక్షునిగా నియమించడానికి కృషి చేసిన పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఏకల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సతీష్ ఖండేల్వాల్ నా వెన్నంటే ఉండి నడిపిస్తూ సంస్థలు అగ్ర స్థానానికి వచ్చేలా చేశారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సంస్థ ద్వారా ఏజెన్సీ గ్రామాలలోని గిరిజన పిల్లలకు విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి నా వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏకల్ అభియాన్ నార్త్ తెలంగాణ శాఖ ప్రభాకర్ సమితి సభ్యులు,ఉత్తర తెలంగాణ సంభాక్ సమితి సభ్యులు, ఉత్తరాంధ్ర సంభాక్ సమితి సభ్యులు, విజయవాడ అంచల్ సమితి, భద్రాద్రి కొత్తగూడెం అంచల్ సమితి సభ్యులు, ఉపాధ్యక్షుడు అప్పలరాజు, కార్యదర్శి వాసుదేవరావు, ఏకల్ పూర్తి సమయ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో ప్రారంభమైన దీపావళి సందడి



**భద్రాచలం, అక్టోబరు 19,ప్రజాజ్యోతి :** భద్రాచలంలో దీపావలి సందడి ప్రారంభమైంది. ఈసారి పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేయడంతో ఆదివారం భద్రాచలంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు టపాసులను కొనుగోలు చేశారు. అలాగే పట్టణంలోని పలు కాలనీలో చిన్నారులు బాణసంచా – కాల్చుతూ సందడి చేస్తున్నారు. దీపావళి సందర్భంగా సోమవారం ఇళ్లల్లో ప్రత్యేక పూజలు, నోములు నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. దీంతో పట్టణంలోని వ్యాపార సముదాయాలన్ని ప్రజల రద్దీతో దర్శనమిస్తున్నాయి.

## లయన్స్ క్లబ్ భద్రాచలం, వికాస తరంగిణి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం




**భద్రాచలం, అక్టోబరు 19,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని కొత్తకాలనీలో ఆదివారం లయన్స్ క్లబ్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పి.రాజశేఖర్, డాక్టర్ అక్కినేని లోకేష్, డాక్టర్ శ్రీక్రాంతి, డాక్టర్ తేజస్వినిలు సేవలందించారు. ఈ వైద్య శిబిరంలో సాధారణ సమస్యలతో పాటు ఇతర వ్యాధులతో వారికి ఉన్న సమస్యలను వైద్యుల దృష్టికి తీసుకురాగా ఉచితంగా మందులు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కమలా రాజశేఖర్, సిద్దారెడ్డి, వికాస తరంగిణి అధ్యక్షులు వెంకటాచారి, గాదె మాధవరెడ్డి, పరిమి సోమశేఖర్ లు పాల్గొన్నారు.

# పాల్వంచ ఆర్టీఏ చెక్ పోస్టుపై ఏసీబీ దాడులు..!

(మొదటి పేజీ తరువాయి...)
వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులపై ఏసీబీ అధికారులు ముందుగా గోప్య సమాచారం సేకరించి, ఆ తర్వాత దాడులకు దిగినట్టు సమాచారం.

**డీఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ..**

ఈ చెక్ పోస్టులో పర్మిట్, ఓవర్ లోడ్, ఫైన్, టాక్స్ కలెక్షన్ లాంటి అంశాల్లో ఏ ఒక్కటి సక్రమంగా అమలు కావడం లేదు. అధికారిక రసీదులు ఇవ్వకుండా అనధికారంగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు మాకు సమాచారం వచ్చింది. అందుకే శనివారం రాత్రి 12.30 గంటల నుంచి దాడులు ప్రారంభించాం అని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈ సోదాల్లో ఇప్పటివరకు అనధికారంగా వసూలు చేసిన సుమారు రూ.25 వేల పైచిలుకు నగదు ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ డబ్బులు చెక్ పోస్టు సిబ్బంది వద్ద దొరికాయని, వాటికి సంబంధించి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఎంవిఐ) మనోహర్ ఎలాంటి సమాధానం ఇవ్వలేకపోయారని ఆయన వెల్లడించారు. “ఈ నగదు మూలం, బాధ్యత ఎవరిది అనే విషయంపై పూర్తి స్థాయి విచారణ జరపాల్సి ఉంది. చెక్ పోస్టులో విధానాలు పూర్తిగా నియమావళి విరుద్ధంగా నడుస్తున్నాయి” అని అన్నారు.

**అన్నింటికీ నిర్దిష్ట రేటు..**

ప్రతి వాహనానికి రూ.200 నుంచి రూ.500 వరకు, ఇసుక రవాణాకు రూ.2000 వరకు నిర్దిష్ట రేటు ఉండేదిగా ఏసీబీ గుర్తించింది. డ్రైవర్లు చెబుతున్న వివరాల ప్రకారం డబ్బులు ఇచ్చిన వారినే ముందుకు పంపే పద్ధతి సర్వసాధారణంగా మారిందని తెలిసింది. దాడుల్లో అధికారులు చెక్ పోస్టు రికార్డులు, రసీదు పుస్తకాలు, కంప్యూటర్ డేటా సీజ్ చేశారు. సిబ్బంది మొబైల్లను కూడా పరిశీలించి లావాదేవీల ఆధారాలు సేకరిస్తున్నారు. ప్రాథమికంగా ఇది వ్యక్తిగత లావాదేవీ కాకుండా ఒక వ్యవస్థాత్మక అవినీతిగా మారిందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. ప్రతిరోజూ ఈ చెక్ పోస్ట్ మిధుగా వందలాది వాహనాలు ఈ చెక్ పోస్టు ద్వారా వెళ్తున్నా, లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్ నెస్ పత్రాలు పరిశీలించకుండా డబ్బులు తీసుకుని వదిలేస్తున్నారని సమాచారం. ఈ వ్యవహారంలో పలువురు ఆర్టీఏ సిబ్బంది పేర్లు ఏసీబీ దృష్టిలోకి వచ్చాయని, వారిని విచారణకు పిలిచే ప్రక్రియ కొనసాగుతోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పేపర్లు ఉన్నా లేకపోయినా, డబ్బు ఇచ్చినవాళ్లకే వదిలేస్తారు. ఏసీబీ వచ్చి చూసినదే నిజం బయటపడటానికి దారితీసింది అని పలువురు డ్రైవర్లు ప్రజా జ్యోతితో ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు కూడా ఈ దాడులను స్వాగతిస్తూ, ప్రజల కష్టార్జిత డబ్బును అధికార దోపిడీగా మార్చిన చెక్ పోస్టు వ్యవస్థపై ఏసీబీ చేయివేసింది.. ఇకనైనా సక్రమమైన చెకింగ్ వ్యవస్థ రావాలి అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏసీబీ అధికారులు చెక్ పోస్టు రికార్డులు, సిబ్బంది వివరాలు సేకరిస్తూ విచారణ కొనసాగిస్తున్నారు. ఇప్పటికే కొంత నగదు స్వాధీనం చేసుకున్నట్టు, పూర్తి వివరాలు త్వరలో అధికారికంగా వెల్లడిస్తామని ఏసీబీ వర్గాలు తెలిపాయి.

## భద్రాద్రి రామయ్యకు ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన

- నిత్యన్నదాన పథకంకు రూ. లక్ష విరాళం



**భద్రాచలం, అక్టోబరు 19,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారంను పురస్కరించుకొని అంతరాయలంలో ఆర్జిత సేవల్లో భాగంగా ప్రత్యేక అభిషేకం, స్వర పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఈ సేవల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్య కల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు. ఆలాగే దేవస్థానం నిత్యన్నదాన పథకంకు రూ.1,00,000, ను సికింద్రాబాద్కు చెందిన కడియాల సత్యనారాయణ – కమల దంపతులు అందజేశారు.

## ప్రజాసంక్షేమ సంఘం మండల అధ్యక్షులుగా కార్తీక్



**భద్రాచలం, అక్టోబరు 19,ప్రజాజ్యోతి :** ప్రజా సంక్షేమ సంఘం మండల అధ్యక్షులుగా కుసిని కార్తీక్ ను ఎన్నుకున్నారు. ఆదివారం భద్రాచలంలో జరిగిన ప్రజా సంక్షేమ మండల సమాఖ్య సమావేశం వ్యవస్థాపక అధ్యక్షులు అల్లాడి పౌలురాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రజా సంక్షేమం కోసం ప్రజల హక్కుల సాధన కోసం పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. అందులో భాగంగా కుసిని కార్తీక్ ను మండల నాయకుల ఉమ్మడి నిర్ణయం మేరకు ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శాంతిరాజ్, యేసు, దశంబాబు, రామకృష్ణ, మురికి శ్రీను, భాస్కర్, యేసు, సామేలురాజు పాల్గొన్నారు.

## ప్రమాదరహితంగా దీపావళి జరుపుకోవాలి

- ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు



**పినపాక,అక్టోబర్ 19(ప్రజాజ్యోతి):** దీపావళి పండుగను ఆనందంగా, ప్రమాదరహితంగా జరుపుకోవాలని ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు కోరారు. ఆదివారం పినపాక మండలం ఈ బయ్యారం పోలీస్ స్టేషన్ లో మాట్లాడారు. టపాసులు పేల్చేటప్పుడు నిర్లక్ష్యం ప్రాణాంతకమవుతుందని హెచ్చరించారు. పిల్లలు పెద్దల పర్యవేక్షణలో మాత్రమే టపాసులు పేల్చాలని, గ్యాస్ సిలిండర్లు, పెట్రోలు, డీజిల్ వంటి ద్రవ ఇంధనాల సమీపంలో టపాసులు కాల్చరాదని సూచించారు.బహిరంగ ప్రదేశాల్లో టపాసులు కాల్చేటప్పుడు ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా, శబ్ద కాలుష్యం నియంత్రణ నిబంధనలు పాటించాలని సూచించారు.అనుమతి లేకుండా టపాసుల దుకాణాలు లేదా గిడ్డంగులు ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్ లేదా స్థానిక పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరిస్తేనే పండుగ సురక్షితంగా, సంతోషంగా సాగుతుందని సీఐ అన్నారు.

## జిల్లా గ్రంథాలయంలో ఫొటోస్ పేపర్ కటింగ్ ఎగ్జిబిషన్



**కొత్తగూడెం, అక్టోబర్ 19 (ప్రజా జ్యోతి):** జిల్లా కేంద్ర గ్రంథాలయం కొత్తగూడెం నందు గతంలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు మరియు ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల ఫోటోలు మరియు పేపర్ కటింగ్ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమాలు ఫోటో మరియు పేపర్ కటింగ్ ఫోటో ఎగ్జిబిషన్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రంథాలయ చైర్మన్ కార్యక్రమాలు సన్మానాలు చేయడం ఒక ఎత్తు అయితే వాటిని ఫోటోల రూపంలో పేపర్ కటింగ్ రూపంలో ప్రదర్శించడం గొప్ప ఆలోచనని కొనియాడారు. ప్రతి ఫోటోను పేపర్ కటింగ్ పరిశీలించి గ్రంథ పాలకురాలిని అభినందించారు.ఇలా ఎన్నో కార్యక్రమాలను గ్రంథాలయాభివృద్ధికి తోడ్పడతాయని దీనిని ఆదర్శంగా తీసుకొని అనేకమంది అభ్యర్థులు ఉద్యోగాలు సంపాదిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు జి. మణి మృదుల విద్యార్థినీ, విద్యార్థులు పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.